# ఝార్ఖండ్

# భూములనుండి ఆదివాసుల గెంటివేత -'విధ్వంసక అభివృద్ధి' విధానం

**ఝార్ఖండ్‌లో** పెట్టుబడులను ఆకర్షించేందుకు గాను ఆ రాష్ట్రప్రభుత్వం రాంచీలో 2017 ఫిబ్రవరి 16, 17 తేదీల్లో పెద్దఎత్తున హంగామా, ఆర్భాటాలతో ఓ అంతర్జాతీయ సమ్మేళనాన్ని నిర్వహించింది. దీని నిర్వహణకోసం అడుగడుగున పోలీసులను మోహరించింది. ఫిబ్రవరి 12 నుండి సదస్సు ప్రాంతాలలోనూ, ఆపై సదస్సు జరిగిన 3 రోజులపాటు రాంచీ మొత్తంగానూ పోలీసులు 144వ సెక్షను విధించారు. ప్రజలు, విద్యార్థులు తమ రోజువారీ కార్యకలాపాలకు చాలా ఇబ్బందుల నెదుర్కొన్నారు. ఝార్ఖండ్‌లోని 'విస్థాపన్ విరోధి నవ నిర్మాణ్ మోర్చా' (వివిఎన్ఎన్) మరియు 'విస్తాపన్ విరోధి జన్ వికాస్ ఆందోళన్'ల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 13వ తేదీన ఆయా సంస్థల ప్రతినిధులు, కార్యకర్తలు, నాయకుల ఆధ్వర్యంలో రాంచీలోని ఆల్బర్ట్ ఎక్కా చౌక్ వద్ద సమ్మేళనాన్ని వ్యతిరేకిస్తూ నిరసన చేపట్టారు. వివిఎన్ఎన్ మోర్చా, మార్క్సిస్టు లెనినిస్టు సంస్థలు, జయప్రకాష్ నారాయణ్ అనుయాయులు, గాంధేయవాదులు, సాంప్రదాయక ఆదివాసీసంస్థల ప్రతినిధులు మరియు కొన్ని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సంస్థలన్నీ 'సంతాల్ పరగణా టెనెన్సీ యాక్టు' (యస్‌పిటి చట్టం), 'చోటానాగపూర్ టెనెన్సియాక్ట్' (సిఎన్‌టి చట్టం)లలో రాష్ట్ర ప్రభుత్వం సవరణలు చేయటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ చట్టాన్ని అమలుచేసేందుకు కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం రాష్ట్ర ప్రభుత్వం వేచిచూస్తున్నది. ఝార్ఖండ్ ప్రాంత ఆదివాసీ, ఆదిమ తెగల గిరిజనుల భూముల పరిరక్షణ కోసం సాగించిన ఎన్నో పోరాటాల ఫలితంగా బ్రిటిష్ వలస పాలకుల కాలంలోనే ఈ చట్టాలు చేయబడ్డాయి.

సమ్మేళనం ముగింపులో, వివిధ కంపెనీలతో 210 అవగాహనా ఒప్పంద పత్రాలపై సంతకాలు జరిగినట్లుగా రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. ఈ అవగాహనా ఒప్పంద పత్రాలనన్నీ తమ ప్రభుత్వం అమలుచేసి తీరుతుందని రాష్ట్రముఖ్యమంత్రి రఘుబీర్‌దాస్ చాలా అహంకారంతో మాట్లాడాడు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన భూబ్యాంకులో 20 లక్షల ఎకరాలు వుంది కావున, కంపెనీలకు ఇవ్వటానికి భూముల గురించిన కొరత ఏమీ లేదని ఆయన పేర్కొన్నాడు. ఆదిమ, ఆదివాసీజాతుల ప్రజానీకపు భూములను బలవంతంగా సేకరించిన ఫలితంగా గతంలో ఎదురైన వైఫల్యాలు, గుణపాఠాల నుండి ఝార్ఖండ్ ప్రభుత్వం పాఠాలు నేర్చుకోవటానికి సిద్ధంగా లేదు. గత ప్రభుత్వాల హయాంలో వందకు పైగా వివిధ కంపెనీలతో అవగాహనా ఒప్పంద పత్రాల (ఎమ్ఓయులు)పై సంతకాలు జరిగి, లక్షలాది ఎకరాల భూములను-ప్రత్యేకించి అత్యధికంగా ఆదివాసుల, ఆదిమ తెగల భూములను సేకరించి, లక్షలాదిమంది ఆదివాసులను విస్థాపనకు గురిచేసే ప్రయత్నాలు జరిగాయి. అయితే ఆదివాసీ ప్రజానీకం, ప్రభుత్వ బలవంతపు భూసేకరణను తీవ్రంగా ప్రతిఘటించారు. అత్యధిక కంపెనీలు భూములు పొందటం సాధ్యంకాక ఖాళీచేతులతో వెనుదిరిగాయి. ప్రజల ఆందోళనకు నాయకత్వం వహించి ముందుండినడిపించే నాయకత్వాన్ని అభివృద్ధివ్యతిరేకులని, జాతి వ్యతిరేకులని ప్రభుత్వం ఆరోపించి వందలాదిమంది నాయకులను, కార్యకర్తలను అనేక అక్రమ కేసులు మోపి జైళ్ళలో నిర్బంధించింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో శాంతియుతంగా తమ నిరసనను తెలియజేసే ప్రజలపై కూడా పోలీసులు లాఠీఛార్జీతోపాటు కాల్పులు సైతం సాగించి అనేకమందిని బలిగొన్నారు; పలువురిని తీవ్రంగా గాయపరిచారు. రాజ్యహింస ప్రజల నైతిక ధృతిని దెబ్బతీయలేకపోగా 'జల్, జంగిల్, జమీన్' (నీరు, అడవి, భూమి)పై వారి హక్కులను పరిరక్షించుకోవాలనే ఆంకాంక్షను మరింత దృఢపరిచింది.

మరోవైపున బడాబూర్జువావర్గ ప్రయోజనాలు నెరవేర్చటంకోసం రాష్ట్రప్రభుత్వం తీసుకుంటున్న ప్రతిచర్యా, అన్నివిధాలా చట్టవ్యతిరేకమైనదే. 'పానెమ్' అనే ప్రైవేటు మైనింగ్ కంపెనీ ప్రయోజనాలకోసం ఎస్‌పిటి చట్టానికి సవరణలు చేసి, పాకూర్ జిల్లాలోని సంతాల్‌ల భూములనుండి వారిని బలవంతంగా గెంటివేయటం, దీనికొక స్పష్టమైన ఉదాహరణ. దేశం మొత్తంలోని రెండువందలకుపైగా వున్న అక్రమ మైనింగ్ కంపెనీలలో ఈ కంపెనీ కూడా ఒకటని సుప్రీంకోర్టు ప్రకటించింది. అయినప్పటికీ ఈ కంపెనీ చట్ట విరుద్ధంగా రాష్ట్రప్రభుత్వ సహాయ సహకారాలతో మైనింగ్ కార్యకలాపాలను ఇంకా కొనసాగిస్తోంది. నిర్వాసితులైన వారికి పునరావాసం కల్పించేందుకు కంపెనీ ఆమోదించిన 'అవగాహనా ఒప్పంద పత్రం'లో నిబంధనలన్నింటినీ తుంగలో తొక్కివేయటంతో ప్రజలు సర్వస్వం కోల్పోయి దాదాపు అనాధలుగా మిగలవలసిన పరిస్థితుల్లోకి నెట్టబడుతున్నారు. ప్రభుత్వం ఈ వైపుగా దృష్టిపెట్టకపోవటమేగాక, అనుమతులు పొందిన సంబంధిత కంపెనీ చట్టబద్ధంగా ప్రజలకు సమకూర్చ వలసిన వాటన్నింటినీ పరిపూర్తిచేసే విధంగా చూడటంలో కూడా విఫలమైంది.

పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టేందుకు ఆదివాసుల భూములను 'భూ బ్యాంకు' పేర కబ్జాచేయటమనేది -రాష్ట్రప్రభుత్వ ప్రస్తుత సరికొత్త ఆలోచన. వ్యక్తిగతంగా కుటుంబాలద్వారాకానీ లేదా సామూహికంగా గ్రామస్థులద్వారా కానీ లేక గ్రామఅటవీ ప్రాంతంలో కానీ సాగుచేయబడని భూమిని విడిగా గుర్తించి పేర్కొనటం జరుగుతోంది. ఖుంతి జిల్లాలోని తోర్పా బ్లాక్‌లోని భూబ్యాంకు గురించిన నిర్దిష్ట ఉదాహరణ మనము చూడవచ్చు.

## ఝార్ఖండ్ రాష్ట్రం ఖుంతి జిల్లా - తోర్పాబ్లాక్ భూబ్యాంక్

**సాగుచేయబడిన ప్రైవేటు భూమి :**

ప్లాట్ల సంఖ్య : 1568
భూసేకరణకు యోగ్యమైనదిగా గుర్తించిన భూమి : 10,898 ఎకరాలు
భూబ్యాంకుకు బదిలీ అయిన మొత్తం భూమి : 1116 ఎకరాలు
ఇప్పటికీ అందుబాటులోనున్న భూమి : 9781 ఎకరాలు

**సాగుచేయబడని ఉమ్మడి భూమి :**

ప్లాట్ల సంఖ్య : 367
భూసేకరణకు యోగ్యమైనదిగా గుర్తించిన భూమి : 683 ఎకరాలు
ఇప్పటికే బదిలీ అయిన మొత్తం భూమి : ఏమీలేదు
ఇప్పటికీ అందుబాటులో నున్న మొత్తం భూమి : 683 ఎకరాలు

**సాగుచేయబడని అటవీ భూమి :**

ప్లాట్ల సంఖ్య : 354
భూసేకరణకు యోగ్యమైనదిగా గుర్తించిన భూమి : 4523 ఎకరాలు
ఇప్పటికే భూబ్యాంకుకు తరలించినది : ఏమీ లేదు
ఇప్పటికీ అందుబాటులోనున్న మొత్తం : 4523 ఎకరాలు

ఈవిధంగా పెద్దమొత్తంలో సేకరించిన 16,104 ఎకరాల సాగుచేయబడని భూమితో తోర్పాబ్లాక్‌లో భూబ్యాంకును ఏర్పరచారు. కొద్ది నెలలక్రితం ఝార్ఖండ్ రాష్ట్ర ముఖ్యమంత్రి భూబ్యాంక్‌లో 1,75,000 ఎకరాల భూమి అందుబాటులో వుంటుందని ప్రకటించాడు.

ఈ కాలంలో పాలకపార్టీలన్నీ ఒకసారో, రెండుసార్లో, మూడు సార్లో రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పరచాయి. ప్రభుత్వాలన్నీ ఎంఓయులను బలవంతంగా అమలుచేసి భూములను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకే పూనుకున్నాయి. ఎస్‌పిటి మరియు సిఎన్‌టి చట్టాలను తిరగతోడటాన్ని ఈ పార్టీలన్నీ విపక్షంలో వుండగా విమర్శించి, అధికారం చేపట్టిన తర్వాత తిరగదోడటానికి సుముఖంగా వ్యవహరించినవే. విస్థాపన సమస్య విషయంలోనూ ఈ పార్టీలన్నీ ఇదేతరహా నాటకమాడు తున్నాయి. కనుక ఝార్ఖండ్‌లోని ఆదిమ, ఆదివాసీ తెగల ప్రజానీకానికి ఏ పాలకపార్టీ పట్లా ఏవిధమైన ఆశాలేదు. అయితే రాష్ట్రవ్యాపితంగా సామ్రాజ్యవాదుల అభివృద్ధి విధానానికి వ్యతిరేకంగా ఝార్ఖండ్ ప్రజానీకాన్ని నడపగలిగే ఒకే ఒక్క రాష్ట్రస్థాయి పార్టీ లేకపోవటం–ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యగా వుంది.

భారతదేశంలో ఈస్టిండియా పాలన సాగుతున్న కాలంనుండీ అనుసరించబడుతున్న సామ్రాజ్యవాదుల ఈ 'అభివృద్ధి' విధానాన్ని వెల్లడిచేసేందుకు సిపిఐ (ఎం-ఎల్) మరియు హూల్ ఝార్ఖండ్ క్రాంతిదళ్‌లు నిరంతరాయంగా ప్రయత్నిస్తున్నాయి. 1947 తర్వాత కూడా ఈ విధానంలో ఏలాంటి మౌలిక మార్పూ చేయలేదు. మనదేశంలో సామ్రాజ్యవాద దేశాలనుండి వస్తున్న పెట్టుబడులకంటే, మనదేశంనుండి విదేశాలకు తరలివెళ్తున్న సంపద, వనరులే అధికంగా వున్నాయని ప్రపంచీకరణ తర్వాత కాలంలో మరింత స్పష్టంగా వెల్లడవుతోంది. ఉద్యోగావకాశాలు లేకుండా వున్న కొద్దిపాటి పరిశ్రమలు మనలేవు; పర్యావరణాన్ని పరిరక్షించేవిగా వుండజాలవు. కనుక అన్ని కోణాల్లో అలాంటి పరిశ్రమలు దేశానికి హితవు కాదు. సామ్రాజ్యవాదుల అభివృద్ధి విధానానికి వ్యతిరేకంగా పోరాడేందుకు యావన్మంది ప్రజానీకం ముందుకు రావాలి.

oooo